కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నిర్వాహకుల నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

చెన్నూర్, ఆగస్టు 11 : మందమర్రిలో నిర్వహించిన కరాటే పోటీల్లో చెన్నూర్ పట్టణానికి చెందిన న్యూ లయోలా పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కరస్పాండెంట్ ప్రవీణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన జతిన్ కౌశిక్ ప్రథమ, వేదశ్రీ, ధరణి అనూష తృతీయస్థానంలో విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు. వీరిని కరరాటే మాస్టర్ ఆఫ్రీన్, ఉపాధ్యాయులు అభినందించారు.

గూడెంలో శ్రావణ సందడి

దండేపల్లి, ఆగస్టు 11 : శ్రావణ మాసం సందర్భంగా దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో భక్తుల సందడి కనిపించింది. సెలవుదినం కావడంతో పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. 88 జంటలు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు ఉన్నారు.

రాజీవ్‌నగర్‌లో వైద్యపరీక్షలు

వాంకిడి, ఆగస్టు 11 : మండలంలోని రాజీనగర్‌లో ఆదివారం గర్భిణులు, బాలింతలకు వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించారు. పలువురికి వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చి, జ్వరంతో ఉన్న ఇద్దరికీ రక్తనమూనాలు సేకరించారు. మందులు పంపిణీ చేశారు. (ఎంఎల్‌హెచ్‌పీ)డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ.. మహిళలు రక్తహీనతను నివారించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పాలు, కోడి గుడ్లు, ఆకు కూరలు ఆహారంలో ఎక్కువగా తినాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం గోదావరి, చంద్రశేఖర్, ఆశ కార్యకర్త సాలక్క గ్రామస్తులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయండి

తాండూర్, ఆగస్టు 11 : వర్గీకరణ సాధించుకొని ఢిల్లీ నుంచి వస్తున్న మంద కృష్ణ మాదిగకు హైదరాబాద్‌లో ఘన స్వాగతం పలుకాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య పిలుపునిచ్చారు. తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులతో కలిసి మాట్లాడారు. మంద కృష్ణ మాదిగ 13న హైదరాబాద్‌కు చేరుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా భారీ సావగత ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల ఇన్‌చార్జి జిలకర శంకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు సునామి తరంగి మాదిగ, ఎంఎస్‌పీ మండల కన్వీనర్ కాసిపేట కృష్ణ మాదిగ, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు ఆయిల్ల గణేశ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు కుషనపల్లి లక్ష్మణ్ మాదిగ, కమలాకర్ మాదిగ, నరసింహులు మాదిగ, అశోక్ మాదిగ, అయిల్ల స్వామి మాదిగ, శ్రీనివాస్ మాదిగ ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

లక్షెట్టిపేట, ఆగస్టు 11 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు తమ బ్యాంక్ ఖాతా వివరాలు ఎవరికీ ఇవ్వవద్దని సూచించారు. ఎలాంటి లావాదేవీలు ఉన్నా నేరుగా బ్యాంక్ వెళ్లి సరిచేసుకోవాలని తెలిపారు. మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులను నమ్మి లావాదేవీలు చేయవద్దని పేర్కొన్నారు. ఇటీవల మండలంలోని కొత్తూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ లింక్ పెట్టి దాన్ని ఓపెన్ చేస్తే రూ.900 వస్తామని చెప్పడంతో బాధితుడు ఓపెన్ చేయడంతో చెప్పిన ప్రకారం డబ్బు వచ్చిందని తెలిపారు. అదే తరహాలో మరికొన్ని రోజులకు రెండు సార్లు రూ.పది వేల చొప్పున వేస్తే రూ.19 వేలు, రూ.23 వేలు వచ్చాయని పేర్కొన్నారు. చివరికి రూ.20 వేలు వేస్తే రూ.63 వేలు వస్తాయని చెప్పడంతో బాధితుడు వేశాడని, రాకపోవడంతో నేరగాడికి మెస్సేజ్ చేశాడని పేర్కొన్నారు. డబ్బు హోల్డ్‌లో పడిందని, వెంటనే రూ.63,807 డిపాజిట్ చేస్తే మొత్తం రూ.88 వేలు వస్తాయని చెప్పడంతో నిజమే అనుకొని బాధితుడు ఆ సొమ్ము వేశాడని, సైబర్ నేరగాడు ఆ మొత్తం డబ్బు డ్రా చేసుకున్నాడని వివరించారు. చివరికి మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడని, విచారణ జరుగగుతున్నదని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలనిసూచించారు.

'ప్రజాసమస్యలపై పోరాటం తప్పదు'

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 11 : ప్రభుత్వం ప్రజాసమస్యలను విస్మరిస్తే పోరాటం తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ స్పష్టం చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో 61 మంది సభ్యులను 15 మంది కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతీ హామీని షరతులు లేకుండా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, విద్యుత్ సంస్థల నుంచి సింగరేణి కంపెనీకి రావాల్సిన రూ.29 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పించాలని, కార్మికుల లాభాల వాటా ప్రకటించి, 35 శాతం ఇవ్వాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటనకే పరిమితం కాకుండా నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఖలీందర్ అలీఖాన్, రేగుంట చంద్రశేఖర్, కారుకూరి నగేశ్, లింగం రవి, జిల్లా సమితి సభ్యులు దేవి పోచన్న, కుంచాల శంకరయ్య, చాడ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

డిప్లామా హోల్డర్స్‌కు అవకాశం ఇవ్వాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 11 : సర్వేస్ డిపార్ట్‌మెంట్లలో డిప్లామా హోల్డర్స్‌కు అవకాశం ఇవ్వాలని హెచ్‌ఎంఎస్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. యాజమాన్యం జారీ చేసిన సర్కులర్‌తో డిప్లామా హోల్డర్స్‌కు నష్టం జరుగుతున్నదని పేర్కొన్నారు. సంస్థలో డిప్లామా చేసిన ఎలక్ట్రికల్, చార్జ్‌హ్యాండ్ ఉద్యోగులకు నష్టం జరుగుతున్నదని తెలిపారు. ఓసీపీ, ఇతర సర్వేస్ డిపార్ట్‌మెంట్లలో ఖాళీగా ఉన్న ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్స్ పోస్టులను భర్తీ చేసేందుకు కేవలం డిప్లామా చేయని ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్లు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సర్కులర్ చారీ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. దీంతో డిప్లామా చేసి ఏళ్ల తరబడి అండర్ గ్రౌండ్‌లో పనిచేస్తున్న ఎలక్ట్రికల్ డిప్లామా హోల్డర్స్‌కు సర్వేస్‌కు వెళ్లే అవకాశం లేకుండా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం వెంటనే స్పందించి, డిప్లామా, నాన్ డిప్లామా వారికి భేదాలు లేకుండా ఓసీపీ, ఇతర డిపార్ట్‌మంట్లలోకి వెళ్లేందుకు అవకాశం కల్పించాలని, ఈ మేరకు యాజమాన్యం తిరిగి సర్కులర్ సవరించి జారీ చేయాలని డిమాండ్ చేశారు.

గాయపడ్డ కార్మికుడికి పరామర్శ

కాసిపేట, ఆగస్టు 11 : మందమర్రి ఏరియా కాసిపేట గనిలో బీ రిలేలో ట్రామర్‌గా పనిచేస్తున్న శరత్ కుమార్ ఆదివారం గని ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఐఎన్టీయూసీ నాయకులు పిట్టల శివకృష్ణ ఆర్కేపీ ఏరియా దవాఖాకు వెళ్లి, శరత్ కుమార్‌ను పరామర్శించారు. అధికారులతో మాట్లాడి, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఐఎన్టీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేవి భూమన్న, ఏరియా హాస్పిటల్ సీఎంవోతో మాట్లాడి, కరీంనగర్‌లోని అపోలో రీచ్ దవాఖాకు పంపించినట్లు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిర్పూర్(టీ), ఆగస్టు 11 : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగ ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు దివాకర్ అధ్యక్షతన మధ్యాహ్న భోజన కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీలో చేరిన కార్మికులను అభినందించారు. అదే విధంగా కార్మికుల వేతనాలు పెంచాలని, నిత్యావసర ధరలకు అనుగుణంగా ఒక్కో విద్యార్థికి రూ.25 స్లాబ్ రేటు ఇవ్వడంతో పాటు తదితర హామీలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు కాంత, రమాదేవి, బుజ్జమ్మ, విజయ, శ్రీదేవి, యశోద, సురేఖ పాల్గొన్నారు.

సహకార నిర్లక్ష్యం

- రుణం లేకున్నా మాఫీ అయినట్టు మెస్సేజ్‌లు
- విస్మయానికి గురైన రైతులు
- కార్యదర్శుల పొంతన లేని సమాధానాలు
- తమ డాక్యుమెంట్లు వాడుకొని రుణాలు తీసుకున్నారేమోనని ఆందోళన
- ఇప్పటికే కలెక్టరేట్‌లో ఫిర్యాదులు

రైతులకు అండగా నిలువాల్సిన సహకార శాఖలో నిర్లక్ష్యం రాజ్యమేలుతున్నది. మంచిర్యాల జిల్లాలోని కొందరు రైతుల పేరిటి రుణం లేకున్నా.. మాఫీ అయిన్నట్లు మొబైల్ ఫోన్లకు మెస్సేజ్‌లు రావడం వారిని విస్మయానికి గురిచేస్తున్నది. ఎంట్రీలో నిర్లక్ష్యమా..? లేక, వ్యవసాయ పనుల కోసం ఇచ్చిన డాక్యుమెంట్లను వాడుకొని, తమ పేరిట రుణాలేమైనా తీసుకున్నారా..? అని రైతాంగం ఆందోళన చెందుతున్నది. దీనిపై కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదులు అందగా, ప్రస్తుతం సహకార శాఖకు చెందిన సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఏవీఆర్డీ ప్రసాద్ రావు విచారణ సైతం చేపట్టారు. అతి త్వరలోనే నివేదిక అందజేయనున్నారు. - మంచిర్యాల (ఏసీసీ), ఆగస్టు 11

అసలేం జరిగింది..?

ముల్కల్లకు చెందిన రైతు బాపునకు వాస్తవానికి రూ.9,727 రుణమాఫీ కావాల్సి ఉంది. సొసైటీ కార్యదర్శి అలసత్వంతో దాన్ని సరైన విధంగా రికార్డుల్లో ఎంట్రీ చేయలేదు. దీంతో బాధితుడి పేరు మీద రూ.1,10,515 రుణమాఫీ జరిగింది. ఇది నేరుగా బాధితుడి సెల్‌ఫోన్‌కు మెస్సేజ్ రూపంలో రావడంతో అతను అవాక్కయ్యాడు. దీంతో సంబంధిత కార్యదర్శి పెంట సత్యనారయణను సంప్రదించగా, పొంతన లేని సమాధానం ఇచ్చారు. దీంతో ఈ వ్యవహారం కలెక్టర్ ఫిర్యాదు వరకు వెళ్లింది. అలాగే రైతు కందుల లక్ష్మయ్యకు కేవలం వాణిజ్య బ్యాంక్‌లో లోన్ ఉండగా, అక్కడ రుణమాఫీ కాకపోగా, సహకార శాఖలో మాఫీ అయినట్లు మెస్సేజ్ రావడంతో కంగుతిన్నాడు. నిజానికి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో లక్ష్మయ్యకు సహకార శాఖలో రుణమాఫీ అయ్యింది. అయితే దాన్ని ఎంట్రీ చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో ఆ రుణం అలాగే కొనసాగినట్లు సమాచారం. దీంతో ప్రస్తుత ప్రభుత్వంలోనూ బాధితుడికి రుణమాఫీ అయినట్లు మెస్సేజ్ వచ్చింది. సంబంధిత ఆఫీసులో సంప్రదించగా, సరైన స్పందన రాలేదు. ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిందా..? లేక రికార్డుల ఎంట్రీలో నిజంగానే తప్పులు దొర్లయా..? అనేది అధికారులు నిగ్గు తేల్చాల్సి ఉంది. దీనిపై ప్రస్తుతం విచారణ పూర్తయ్యింది.

అన్నిచోట్ల ఇంతేనా..!

వాణిజ్య బ్యాంకులతో పోలిస్తే సహకార శాఖలో రుణాలు కాస్త విభిన్నంగా ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా 20 సహకార సంఘాలు ఉండగా, చాలా చోట్ల ఇలాంటి అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఆరోపణలు చేసిన బాధితుల కోణంలో కాకుండా, జిల్లా వ్యాప్తంగా దర్యాప్తు చేస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశమున్నది. నిజానికి తమ పేరిట లోను లేక పోయినప్పటికీ, రుణమాఫీ కావడంపై పలువురు రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనుల కోసం తాము ఇచ్చిన పలు డాక్యుమెంట్లను వాడుకొని, తమ పేరిట రుణాలేమైనా తీసుకున్నారా..? అని కొంత మంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి నిర్లక్ష్యం వల్ల తాము రుణాలు తీసుకున్న చోట ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు ఆడిట్ చేస్తే ఇలాంటి పొరపాట్లు పునరావృతమయ్యే అవకాశం ఉండదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మొత్తం మీద అధికారులు దీనిపై కూడా దృష్టిపెట్టి, నిజాలు వెలుగులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయం

రిపోర్ట్ సబ్‌మిట్ చేశాం..

రైతుల పేరిట రుణమాఫీ స్వాహా జరిగినట్లు మాకు ఫిర్యాదులు అందాయి. కలెక్టరేట్‌లో ఫిర్యాదు అందిన మేరకు, నివేదిక పంపించాలని మాకు ఆర్డర్స్ వచ్చాయి. ఈ మేరకు లోతుగా విచారణ చేపట్టాం. ఉన్నతాధికారులకు సబ్‌మిట్ చేశాం. వారు పరిశీలిస్తున్నారు. - ప్రసాద్ రావు, విచారణ అధికారి

ప్రమాదాల నివారణకే కార్డన్ సెర్చ్

మాట్లాడుతున్న సీఐ శశిధర్ రెడ్డి, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు

కాసిపేట, ఆగస్టు 11 : గ్రామాలు, పట్టణాల్లో ప్రమాదాల నివారణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని కాసిపేట సీఐ శశిధర్ రెడ్డి తెలిపారు. మండలంలోని లంబాడీతండా(డీ)లో ఆదివారం దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బందితో కలిసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎవరైనా అనుమాన స్పద వ్యక్తులు ఉంటున్నారా అని ఆరా తీశారు. ప్రతీ ఒక్కరి ఆధార్, గుర్తింపు కార్డులను పరిశీలించారు. అలాగే బైకులు, ఆటోల ఆర్సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని, నంబర్ ప్లేట్లు లేని 35 బైకులను గుర్తించి, అక్కడికక్కడే సరి చేశారు. 4 లీటర్ల లిక్కర్ సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. సైబర్ క్రైం, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ రూల్స్, కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ ఫోర్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పూలాజీ బాబా జయంతి ఘనంగా నిర్వహించాలి

మాట్లాడుతున్న సంస్థాన్ అధ్యక్షుడు ఇంగ్లే కేశవ్

జైనూర్, ఆగస్టు 11 : సద్గురు పూలాజీ బాబా జయంతి వేడుకలను ఈ నెల 30 న ఘనంగా నిర్వహించాలని సంస్థాన్ అధ్యక్షుడు ఇంగ్లే కేశవ్ పేర్కొన్నారు. జైనూర్ మండలం పట్నాపూర్ సంస్థానంలో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల ఉద్యోగులకు పట్నాపూర్ లో డ్యూటీ వేయాలని కోరారు. కలెక్టర్, ఐటీడీ పీవో అధికారులు, రాజకీయ నాయకులు 20వ తేదీన వరకు కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఉన్నతాధికారులు పులాజీ బాబా జన్మదిన నిధులను త్వరగితిన విడుదల చేసి, ఏర్పాట్లు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ రాష్ట్ర ఆద్యుక్షుడు కుడే కైలాస్,అంద్ ఆదివాసీ అసిఫాబాద్ జిల్లా ఆద్యుక్షుడు గారులే నారాయణ్,సంస్థన్ గౌరవ ఆద్యుక్షులు వామన్‌రావ్, మాలి సంఘం జిల్లా ఆద్యుక్షుడు నగోస్ శంకర్,మగడే దాదారావు, కోండిబా బర్గె, సతీష్ గురునులే, పాండురంగ్, గుహడే సారంగారావు, గంగాధర్, మారుతి, సుభాష్ దుక్రే తదితరులు పాల్గొన్నారు.

సీఐ, ఎస్ఐల బాధ్యతల స్వీకరణ

కౌటాల, ఆగస్టు 11 : కౌటాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ముత్యం రమేశ్ శనివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సాదిక్ పాషా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ములుగు జిల్లా నుంచి ముత్యం రమేశ్ వచ్చారు. కౌటాల సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలకు ప్రజలంతా సహాయ సహకారాలు అందించాలని కోరారు.

చింతలమానేపల్లి, ఆగస్టు 11 : చింతలమానేపల్లి ఎస్ఐగా నరేశ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన కల్యాణం నరేశ్, రామగుండం కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లారు. కుమ్రం భీం వీఆర్ కేబీఎం ఆసిఫాబాద్ నుంచి నరేశ్ ఇక్కడికి వచ్చారు. అనంతరం సిబ్బందితో ఆయన మాట్లాడారు.

కాగజ్‌నగర్, ఆగస్టు 11 : కాగజ్‌నగర్ రూరల్ ఎస్ఐగా మహేందర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఎస్ఐ సోనియా జిల్లా ఎస్‌బీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కాగా, కాగజ్‌నగర్ టౌన్ ఎస్ఐ మహేందర్ రూరల్ ఎస్ఐగా బదిలీపై వచ్చారు.

సేవా కార్యక్రమాలు

మాధవికి స్వాగతం పలుకుతున్న వాసవి సభ్యులు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 11: మంచిర్యాల వాసవీ కబ్స్ ఆధ్వర్యంలో జిల్లా గవర్నర్ జంధ్యం మాధవి పర్యటన సందర్భంగా ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా విశ్వనాథ ఆలయంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు చేపట్టారు. అనంతరం మంచిర్యాల వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్, వాసవి యూత్ క్లబ్, వాసవి కపుల్స్ క్లబ్, విజయం టీచర్స్ క్లబ్, విజయం వేంపల్లి ఈ క్లబ్, బీ జోన్ ఈ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులు, నిరుపేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఏకలవ్య ఆశ్రమంలో బియ్యం, విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ, రెడ్‌క్రాస్ సొసైటీలో వృద్ధులకు చేతి కర్రలు, చెప్పులు అందజేశారు. జిల్లా క్యాబినెట్ సెక్రటరీ జంధ్యం మధుకర్, క్యాబినెట్ ట్రెజరర్ కేశెట్టి వంశీకృష్ణ, రీజియన్ చైర్‌పర్సన్ కాసం సతీశ్, రీజియన్ సెక్రటరీ గౌరీశెట్టి ధనలక్ష్మి, అంతర్జాతీయ ప్రోగ్రాం కోఆర్డినేటర్ అక్కనపెల్లి రవీందర్, పుల్లూరి బాలు మోహన్, జిల్లా అధికారులు ఉత్తూరి రమేశ్, నాగిశెట్టి జ్యోతి, దొంతుల లావణ్య, జోన్ చైర్‌పర్సన్లు నలమాసు ప్రవీణ్, అయిత శ్రీనివాస్, దైద సరిత, తాటిపల్లి రమేశ్, అన్ని క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో విద్యార్థుల సత్తా

విద్యార్థిని అభినందిస్తున్న పట్టణ సీఐ శంకరయ్య

కాగజ్‌నగర్, ఆగస్టు 11 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. ఆదిలాబాద్ జిల్లాలో బీడీ మన్మోహన్ బాక్సింగ్ పోటీలు శనివారం నిర్వహించారు. కాగజ్‌నగర్ ముత్తు బాక్సింగ్ అసోసియేషన్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు బంగారు పథకాలు, పది మంది విద్యార్థులు సిల్వర్ పథకాలు సాధించనట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. వీరిని పట్టణ సీఐ శంకరయ్య అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, ఆగస్టు 11 : కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన వ్యాపారి జాకీర్ ఇటీవల అనారోగ్యం మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామార్శించారు. భరోసా కల్పించారు. ఈయన వెంట బీఆర్ఎస్ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, పార్టీ నాయకులు ఉన్నారు.

పేకట రాయుళ్ల అరెస్ట్

పట్టుబడిన 9 మందిని చూపుతున్న పోలీసులు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 11 : పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసి, కేసు నమోదుచేసినట్లు మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. మంచిర్యాల జాఫర్ నగర్‌లోని ఓ ఇంట్లో అదివారం పేకాట ఆడుతున్నట్లు సమాచారం రాగా, ఎస్ఐ సురేశ్, సిబ్బంది బాబాజీ, సుబ్బారావు, భరత్ ఆధ్వర్యంలో తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. ఈ మేరకు మంచిర్యాలకు చెందిన గులాం ఖాజా సలీముద్దీన్, బేర నరేశ్, మర్రెపల్లి రవీందర్, చెన్నూరి లక్ష్మణ్, అరిగేల సంపత్, కోదూరి వాసు, మొగిలి జగన్, ముల్కల్ రాఘవ్, మొగిలి అవశోదంను పట్టుకున్నట్లు, వారి నుంచి రూ.32,870, 10 మొబైల్ ఫోనుల, 2 బైకులను సీజ్ చేసినట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

సిర్పూర్(టీ), అగస్టు 11 : మహారాష్ట్రలోని గోండ్‌పిప్రి నుంచి సిర్పూర్(టీ) మండలం వెంకట్రావ్‌పేట్ మీదుగా కౌటల మండలానికి అక్రమంగా తరలిస్తున్న 12 గోవులను ఆదివారం పట్టుకున్నట్లు సిర్పూర్(టీ) ఏఎస్ఐ రాములు తెలిపారు. పక్కా సమాచారం మేరకు వెంకట్రావ్‌పేట్‌లో తనిఖీలు చేపట్టా, బొలేరో వాహనంలో ఆవులు తరలిస్తున్నటుల గుర్తించామన్నారు. ఈ మేరకు వాహనాన్ని సీజ్‌చేసి, యజమాని ఆశ్వన్, డ్రైవర్లు నెవారే కిషోర్, కొడప అనూఫ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'అధికారులు మొద్దు నిద్ర వీడాలి'

సిర్పూర్(టీ), ఆగస్టు 11 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధికారులు మొద్దు నిద్ర వీడి, రోడ్లను పరిరక్షించాలని బీజేపీ సిర్పూర్(టీ) మండల నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని వెంకట్రావ్‌పేట్ అంతర్రాష్ట్ర రహదారిని ఆదివారం పరిశీలించారు. జిల్లాలోని వాంకిడి మీదుగా జాతీయ రహదారి ఉండగా, నిత్యం సిర్పూర్(టీ) మీదుగా భారీ వాహనాలు రాపోకలు సాగిస్తున్నాయనీ, దీంతో మండలంలోని ఆర్‌అండ్‌బీ, అంతర్రాష్ట్ర రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయన్నారు. అనుమతులు లేని వాహనాలు ఈ రోడ్డు మీదుగా వెళ్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. సమస్య పరిష్కారంకాకపోతే ఈ రోడ్డుపైనే ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. నాయకులు బనార్కర్ సాయి, దంద్రె దివాకర్, బజరంగ్‌దళ్ నాయకుడు దుర్గం ప్రశాంత్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో నేడు స్పాట్ అడ్మిషన్లు

బెల్లంపల్లి, ఆగస్టు 11 : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ దేవేందర్ తెలిపారు. ఖాళీగా ఉన్న డిప్లామా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రూమెంటేషన్ ఇంజినీరింగ్ విభాగంలో 16 సీట్ల భర్తీ కోసం అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు హాజరవ్వాలని సూచించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమారం, ఆగస్టు 11 : భీమారం మండల కేంద్రంలోని 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్‌కు తరచూ అంతరాయం ఏర్పడుతున్నది. శనివారం ఏకంగా 5 గంటలు (ఉదయం 10 సాయంత్రం 3 గంటల వరకు), ఆదివారం కూడా 5 గంటలు (తెల్లవారుజామున 5 నుంచి 10 గంటల వరకు) సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై అధికారులను సంప్రదించగా, మెయింటనెన్స్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నేపథ్యంలో అంతరాయం ఏర్పడిందని తెలిపారు.

బురద రోడ్డు చదును



ఆటోలు వెళ్లేందుకు రోడ్డు చదును చేస్తున్న బాపురావు

చింతలమానేపల్లి, ఆగస్టు 11 : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు డబ్బా గ్రామ పంచాయతీ పరిధి బారెగూడలో రోడ్డు పూర్తిగా బుదరమయమైంది. దీంతో గ్రామస్తులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉండడంతో ఆదివారం ఆటో డ్రైవర్ బాబురావు రోడ్డును చదును చేసి, ఆటోలు వెళ్లే చేశాడు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జాతీయస్థాయిలో ప్రతిభ

చెన్నూర్, ఆగస్టు 11 : హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో చెన్నూర్ పట్